
ప్రజాశక్తి
శుక్రవారం 26 జులై 2024
5
పార్వతీపురం మన్యం



31న విఆర్ఎస్ నీరు విడుదల

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని వెంగళరాయ జలాశయం నుంచి ఆయకట్టు భూములకు సాగునీటిని ఈనెల 31న విడుదల చేయనున్నట్లు మండల టిడిపి అధ్యక్షులు గుల్ల వేణుగోపాలనాయుడు తెలిపారు. రాష్ట్ర గిరిజన శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి సాగునీటిని విడుదల చేయడానికి ముహూర్తం ఖరారు చేశారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు స్థితి గతులు, ప్రాజెక్టులో నీటి నిల్వల పరిస్థితిపై అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో జలవనరుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజాన అప్పల నాయుడు సమక్షంలో డిఇఇ ద్వారపురెడ్డి సురేష్, ఎఇలు పాల్గొని సాగు నీరు విడుదలకు కావాల్సిన సన్నాహాలపై చర్చించనున్నట్టు తెలిపారు. ఈ సాగు నీటి విడుదల కార్యక్రమానికి అన్ని పంచాయతీల రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

వట్టిగెడ్డ నీరు 'ఒట్టిదే'



- జైకా నిధులతో ఆధునీకరణ పనులు జరిగేనా?
- బిల్లులు చెల్లించక చేతులెత్తేసిన గుత్తేదారులు
- సిబ్బంది కొరతతో అవస్థలు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

గురుగుబిల్లి, జియ్యమ్మవలస మండలాలకు ప్రధాన సాగునీటి వనరైన ఒట్టిగడ్డ జలాశయం నుంచి ఈ ఖరీఫ్‌కు సాగునీరు ప్రశ్నార్థకమేనని రైతులు ఆందోళన చెందుతున్నారు. జూలై నెలాఖరు కావస్తున్నా ఇంత వరకు వర్షాలు సరిగ్గా పడకపోవడంతో ప్రాజెక్టులో నీరు చేరలేదు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 399 అడుగు ఉండాల్సి ఉండగా, గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రస్తుతం 382.8 అడుగుల నీరు చేరిందని అధికారులు తెలిపారు. దీంతో పూర్తిస్థాయిలో సాగు నీరు విడుదల చేసే అవకాశం లేకపోవడంతో రైతులు కొంత ఆందోళన చెందుతున్నారు.



జలాశయం నుంచి నీరు విడుదల చేయకపోవడంతో అరకొరగా ఉన్న కాలువలో నీరు

ఇదిలా ఉండగా 2019లో జైకా ద్వారా ఈ ప్రాజెక్టు ఆధునీకరణ పనులకు రూ.44.85 కోట్లు మంజూరు చేయగా, రెండేళ్లు కరోనా కాలంలో పనులు జరగక 2022- 23 ఆర్థిక సంవత్సరంలో కేవలం రూ.9 కోట్లతో కాలువ లైనింగ్ పనులు, నీరు వృథా కాకుండా స్పిల్‌వే గేట్లు మరమ్మతులు జరిగాయి. పనులు చేసిన గుత్తేదారులకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో ప్రాజెక్ట్ ఆధునీకరణ పనులు అంతంత మాత్రమేనని రైతులు అంటున్నారు. కొన్నేళ్లుగా ప్రాజెక్టులో పేరుకుపోయిన పూడికతీత పనులు జరగకపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం మాత్రం పెరగక సాగునీరందడం లేదనిఈ ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్నదాతకు ఎంతో ఆసరాగా ఉన్న ఒట్టిగెడ్డ ప్రాజెక్టు ఎన్ని ప్రభుత్వాలు మారినా నిర్లక్ష్యానికి గురి కావడంతో సాగునీటి సమస్య పరిష్కారం కావడం లేదు. దీనికి తోడు గతంలో 13 మంది సిబ్బంది పని చేయగా, ప్రస్తుతం ఒకే ఒక్క లస్కరు, మరో ఇద్దరూ మెన్ మజ్దూర్లు ఉన్నారు. వీరితో ప్రాజెక్ట్ నిర్వహణ పనులు చేయడం కూడా కష్టంగానే ఉందని సిబ్బంది తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టు పరిధిలోని కుడి కాలువ ద్వారా 13324 ఎకరాలకు, ఎడమ కాలువ ద్వారా మరో 3360 ఎకరాలకు సాగు నీరు అందుతుంది. కాలువ ప్రాజెక్టు గర్భం నుంచి పూర్తి స్థాయిలో పూడిక తీసుకుంటే శివారు ప్రాంతాలైన బాసంగి, గిజబ, సింగనాపురం, చింతలబెలగాం, కుదమ తదితరు పంచాయితీలకు పుష్కలంగా సాగునీరందుతుందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రిజర్వాయర్ పనులు సకాలంలో పూర్తి చేసి ఆయకట్టుకు సాగునీరందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కాలువలకు గండ్లు పడకుండా చూడాలి

తోటపల్లి రిజర్వాయర్‌ను సందర్శించిన కలెక్టర్



తోటపల్లి రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

ప్రజాశక్తి - గరుగుబిల్లి

తోటపల్లి ప్రాజెక్టు రక్షణ కట్టలు, ప్రధాన కాలువలు కోతకు గురికాకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ జల వనరుల శాఖ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి బ్యారేజ్ ప్రాజెక్టు ప్రధాన కుడికాలువ, స్పిల్ వే రెగ్యులేటర్ నీటి ప్రవాహస్థాయిని గురువారం ఆయన పరిశీలించారు. తోటపల్లి ప్రాజెక్టు హెడ్ రెగ్యులేటరీ వద్ద మిషనరీ కాంపోనెంట్స్, సాగు నీటి విడుదల చేసే గేట్లను పరిశీలించారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు తోటపల్లి ప్రాజెక్టు బ్యారేజీ వద్ద నీటి నిల్వ స్థాయి, ప్రాజెక్ట్ కింద ఆయకట్టుకు అందుతున్న సాగునీరు, విస్తీర్ణం, మిగుల జలాల విడుదల, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ముంపు గ్రామాలు, తదితర విషయాలపై ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువకు ఇరువైపులా ఉండే బండలను వర్షాల వల్ల కోతకు గురి కాకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలన్నారు. ప్రాజెక్టులో పేరుకుపోయిన గుర్రపు డెక్క నివారణకు శాస్త్రీయ, సాంకేతిక శాశ్వత పరిష్కారం కనుగొనాలని సూచించారు. తోటపల్లి బ్యారేజీ ప్రాజెక్టు కాలువల నిర్వహణ పక్కాగా చేపట్టాలన్నారు. తోటపల్లి బ్యారేజీ ప్రాజెక్టు, కాలువల నిర్వహణకు లష్కర్ల కొరత ఉన్నందున శాశ్వత ప్రాతిపదికన నియమించాల్సి ఉందని, తోటపల్లి పిల్ల కాలువల తవ్వకానికి భూమి సేకరించాల్సి ఉందని, ప్రధాని కుడి కాలువ శివారు భూములకు సాగు నీటి కొరత లేకుండా సాఫీగా నీరు సరఫరా అయ్యేందుకు కుడి ప్రధాన కాలువను కొన్ని రీచ్‌ల వద్ద సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ పనులు జరిపించాలని కలెక్టర్ దృష్టికి ఇంజనీరింగ్ అధికారులు తీసుకువచ్చారు. సాగునీటి కాలువల పనులకు సక్రమంగా నిధులు వినియోగానికి తగిన యాక్షన్ ప్లాన్ ను సిద్ధం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో జల వనరుల శాఖ ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ రఘు, జెఇ కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయ సందర్శన

పార్వతీపురం మండలం అడ్డాపు శీల సమీపాన గల కాశీ విశ్వేశ్వర స్వామిని కలెక్టర్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు పూర్ణ కుంభంతో మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వయంభూగా వెలసిన కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయ విశిష్టతను, పురాతన చరిత్రను పురోహితులు కష్ణ చంద్ర శర్మ, కలెక్టర్ కు వివరించారు.



కాలువలో పూడికలు తీయిస్తున్న అధికారులు, సిబ్బంది

యుద్ధ ప్రాతిపదికన పూడిక తీతలు

మంత్రి సంధ్యారాణి ఆదేశాలతో స్పందించిన అధికారులు

ప్రజాశక్తి- పాచిపెంట

పెద్దగెడ్డ జలాశయం నుంచి పాచిపెంట, సాలూరు, రామభద్రపురం మండలాలకు సంబంధించి 12 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. కొద్ది రోజుల్లో ఖరీఫ్ సాగుకు సాగునీరు విడుదల చేయాల్సిన నేపథ్యంలో గత కొన్నేళ్లుగా జలాశయం ప్రధాన పిల్ల కాలువలు పిచ్చి మొక్కలు, పూడికలతో పేరుకు పోయాయి. దీంతో ఆయకట్టు రైతులు ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు నీరు సక్రమంగా అందుతుందో లేదో అని ఆందోళన చెందారు. దీనిపై స్పందించిన రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ, స్త్రీ, శిశు సంక్షేమశాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి నీటిపారుదల శాఖ అధికారులు, జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి తక్షణమే కాలువల పూడికలు తీతకు రూ.4.70లక్షలు నిధులు మంజూరు చేయించారు. గత మూడు రోజులుగా వేగావతి ఎడమ కాలువ సంబంధించి విశ్వనాధపురం, మంచాడవలస గ్రామాల వద్ద వన్‌ఆర్ పిల్ల కాలువల్లో జెసిబి సహాయంతో పూడికలు తొలగిస్తున్నారు. పూడికల తొలగింపులు ఇంజనీరింగ్ అధికారులతో పాటు పాంచాలి సర్పంచ్ గూడెపు యుగంధర్, చల్లా కనకారావు, కే సత్యనారాయణ పనులు పర్యవేక్షిస్తున్నారు. పూడుకలు తొలగింపుతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మూడు రోజులుగా దీక్ష చేస్తున్నా..

స్పందించని అధికారులు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

తమను రెన్యువల్ చేయాలని కోరుతూ స్థానిక ఐటిడిఎ వద్ద సిఆర్‌టిలు యుటిఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారా దీక్షలు వానలను సైతం లెక్కచేయకుండా మూడో రోజుకు చేరుకున్నప్పటికీ ఐటిడిఎ అధికారులు ఏమాత్రం స్పందించకపోవడం శోచనీయమని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహన్రావు అన్నారు. గురువారం వారు మాట్లాడుతూ ప్రభుత్వం 206 మందికి రెన్యువల్ చేసుకొనేందుకు ఆర్థిక అనుమతితో పాటు ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ స్థానిక ఐటిడిఎ అధికారులు 47 మందికి రెన్యువల్ చేయకపోవడం దారుణమన్నారు. పదేళ్ల నుంచి ఎగైనెస్ట్ ఎస్‌జిటిలకు రెన్యువల్ చేశారని, గత ఏడాది కూడా ఈ అధికారులే రెన్యువల్ చేసినప్పటికీ ఈ ఏడాది సిఆర్‌టిలను ఇలాంటి ఇబ్బందులకు గురిచేయడం అన్యాయమని అన్నారు. సిఆర్‌టిలు తమకు న్యాయం చేయాలని కోరుతూ మూడు రోజులుగా వానలను సైతం లెక్కచేయకుండా నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నప్పటికీ అధికారుల నుంచి కనీస స్పందన కరువైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఈ విషయాన్ని కలెక్టర్‌కు తెలిపామన్నారు. కొత్తగా వచ్చిన పిఒనైనా స్పందించి ఈ 47 మంది సిఆర్‌టిలను రెన్యువల్ చేయాలని, లేనిచో ఈనెల 29న చలో ఐటిడిఎ చేపడతామని వారు తెలిపారు.



కలెక్టరేట్ వద్ద రిలే నిరాహారదీక్ష దీస్తున్న చేస్తున్న సిఆర్‌టిలు



ఇళ్ల మధ్య నిల్వ ఉన్న మురుగునీరు

మురుగు నీటిలోనే సావాసం

పేరుకే పారిశుధ్య పక్షోత్సవాలు... పట్టని అధికారులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఒకవైపు పారిశుధ్య పక్షోత్సవాలు జరుగుతుండగా, మరోవైపు సాక్ష్యాత్తూ జిల్లా కేంద్రమైన పార్వతీపురంలోనే అపారిశుధ్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. పట్టణంలోని కొత్తవలస 9వ వార్డులో విజయరామరాజు కాలనీలో ఉన్న మొదటి వీధిలో నివాసముంటున్న స్థానికులు మురుగునీటిలోనే సావాసం చేస్తున్నారు. ఈ వీధి శివారులో రైల్వే శాఖ మూడో ప్లాట్‌ఫారం లైన్ నిర్మాణంలో భాగంగా రైల్వే శాఖ రక్షణ గోడను నిర్మించడంతో ఆ వీధిలో ఉన్న నివాస గృహాల వాడుకనీరు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో వాడుక నీరంతా రోడ్డుపైనే నిలిచి ఉండిపోవడంతో దుర్భర జీవితం గడుపుతున్నారు. ఈ సమస్యపై స్థానికులు చాలా నెలల క్రితం మాజీ ఎమ్మెల్యే జోగారావుకు, ఆవార్డు కౌన్సిలర్‌కు, మున్సిపల్ ప్రజారోగ్య అధికార దృష్టికి, వార్డు సచివాలయ శానిటరీ కార్యదర్శి దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. దీంతో ఈ వీధిలో నివాసముంటున్న ప్రజలు మురుగునీటిలోనే సావాసం చేస్తూ అనారోగ్యం పాలవుతున్నారు. పారిశుధ్య పక్షోత్సవాలు కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, మరోవైపు దీర్ఘకాలంగా ఉన్న సమస్యపై కనీసం దృష్టి పెట్టకపోవడం దురదృష్టకరమని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఈ సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టి సమస్య పరిష్కార దిశగా అడుగులు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

మనుమడు మరణం తట్టుకోలేక

తాత ఆత్మహత్య

ఏజెన్సీలో అలముకున్న విషాదం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం / కురుపాం

అల్లారు ముద్దుగా పెంచుకున్న మనుమడు పసిప్రాయంలోనే అకాల మరణం చెందడం చూసి తట్టుకోలేని వరుసకు చిన్న తాత పత్తి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ బుధవారం రాత్రి భద్రగిరి ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే కురుపాం మండలం తిత్తిరి పంచాయతీ కీడవాయికి చెందిన బిడ్డిక పృధ్వీ (8) ధర్మలక్ష్మీపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. అయితే పృధ్వీకి జ్వరం రావడంతో కొన్ని రోజుల కిందట ఇంటికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం ఇంటి వద్దనే మృతి చెందాడు. మనుమడు మృతి చెందడంతో చూసి తట్టుకోలేని తాత బిడ్డిక బాపన్న (హిౖజ్రా) (60) పత్తి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని గమనించిన బంధువులు వైద్యం కోసం మొండిఖల్ ఆసుపత్రికి తీసుకువచ్చి వైద్యం అందించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో ఉన్నత వైద్యం కోసం భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చారు. చికిత్స పొందుతూ బాపన్న మృతి చెందాడు. భద్రగిరిలో సామాజిక కేంద్రంలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని నీలకంఠాపురం ఎస్ఐ నీలకంఠారావు బంధువులకు అప్పగించారు. బాపన్న హిౖజ్రా కావడంతో తన అన్న కుటుంబాన్ని తన సొంత కుటుంబంగా భావిస్తుం డేవాడు. ఇందులో భాగంగా పృధ్వీని చిన్నప్పటి నుంచి గారాబంగా పెంచారు. బాపన్న చేతుల మీదుగా పెరిగిన పృధ్వీ



పృధ్వీ (ఫైల్)



బాపన్న (ఫైల్)

ఇంతలో జ్వరం రూపంలో మృతి చెందాడు. మనుమడు అకస్మాత్తుగా మరణించడాన్ని తట్టుకోలేని తాత బాపన్న మానసిక వేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఒకే రోజు ఒకే ఇంటి వద్ద ఇద్దరి మృతితో ఆసుపత్రి ఆవరణ, గ్రామంలో కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

గ్రామాలు పరిశుభ్రంగా మారాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ప్రతి గ్రామం పరిశుభ్రంగా మారాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఎంపిడిఒలు, మహిళా శిశుసంక్షేమశాఖ అధికారులు, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీ రాజ్ అధికారులతో గురువారంకలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో బయట చెత్త వేయరాదని, దీనిపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. చెత్త వేయం, పరిశుభ్ర గ్రామంగా ఉంచుతామని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించాలని, జ్వరాల పరిస్థితిని ప్రతి రోజూ గమనించాలని చెప్పారు. మండలాల్లో మలేరియా కేసులపై వైద్య అధికారులతో సమన్వయం చేయాలని అన్నారు. ఐఆర్ ఎస్ స్ప్రేయింగ్‌ను తనిఖీ చేయాలని ఆదేశించారు. మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థలు, ఇతర సంస్థల సామాజిక బాధ్యతతో దోమ తెరలు పంపిణీకి ముందుకు వచ్చే అవకాశాలను పరిశీలించాలని చెప్పారు. సీతంపేట ఐసిడిఎస్ పిఒ రామలక్ష్మి చొరవను అభినందించారు.

ప్రత్యేక అధికారుల దినోత్సవం

మండల ప్రత్యేక అధికారులు ఫ్రైడే డ్రై డే కార్యక్రమాలను విస్తృతంగా పర్యవేక్షించాలని అన్నారు. మండలాల్లో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణను పరిశీలించాలని, లోపాలను గుర్తించాలని చెప్పారు. ఎంపిక చేసిన గ్రామాల్లో డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేయడంలో చొరవ చూపాలని అన్నారు. డిపిఒ బలివాడ సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటి వరకు 340 గ్రామ పంచాయతీల్లోను, 951 గ్రామాల్లోనూ పారిశుధ్య నిర్వహించామన్నారు. తాగు నీటి పథకాలను శుభ్రపరచడం, క్లోరినేషన్ చేసిన తేదీని విధిగా రాయాలని పేర్కొన్నారు. నీటి నిల్వలు ఉండే ప్రదేశాలను (హాట్ స్పాట్ ప్రదేశాలు) గుర్తించి పారిశుధ్య నిర్వహణలో దృష్టి సారించాల్సిన అవసరం ఉందని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, సిపిఒ పి.వీర్రాజు పాల్గొన్నారు.



డిఇఒకు వినతిని అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు యుటిఎఫ్ ప్రత్యేక కార్యాచరణ

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు యుటిఎఫ్ చేపట్టిన దశల వారీ కార్యాచరణలో భాగంగా గురువారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో డిఇఒ జి.పగడాలమ్మకు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్‌రావు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో, విద్యారంగాన్ని పూర్తిగా నాశనం చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వీటిని సరిచేసి సరైన గాడిలో పెట్టాలని కోరారు. ఈ విద్యా సంవత్సరంలో జిల్లాలో సుమారు 4వేల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నమోదు గణనీయంగా తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి కారణం గత ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ 117, 172 మెమో కారణమని అన్నారు. కావున ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని కార్యాచరణలో భాగంగా డిఇఒకు, కలెక్టర్‌కు, ఎమ్మెల్యేలకు, మంత్రులకు వినతి అందిస్తున్నామని తెలిపారు. వినతిని అందుకున్న డిఇఒ స్పందిస్తూ ఈ విషయాన్ని ప్రభుత్వానికి పంపిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు ఎన్.శ్రీనివాస్, పి.వెంకట నాయుడు, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

బంగారు భవితకు బాటలు వేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

విద్యార్థి దశ నుంచే ఆసక్తి గల రంగాల్లో లక్ష్యాన్ని ఏర్పరచుకొని బంగారు భవితకు బాటలు వేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. శిక్షా సప్తా విద్యా వారోత్సవాల వేడుకల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమన్నారు. క్రీడలు, సాంస్కృతిక, లలిత కళలు వంటి రంగాల్లో ప్రావీణ్యం సంపాదించాలని విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. ఆరోగ్యం కోసం మంచి ఆహార అలవాట్లు, పరిశుభ్రతపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. రక్త హీనత లోపం తలెత్తకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థినులు ప్రదర్శించిన ప్రార్థనా గీతాలు, నాడు - నేడు నాటిక, సామూహిక నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. శిక్షా సప్తా విద్యా వారోత్సవాల వేడుక నిర్వహణపై సంతప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిఇఒ జి.పగడాలమ్మ, ఎంఇఒ కె.ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు పివి ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బడి తోటలు నిర్వహించాలి

పాఠశాలల్లో బడితోటలు నిర్వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. విద్యాశాఖ అధికారులతో గురువారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల బోధనా ప్రమాణాలతో ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. రక్తహీనత నివారణ పట్ల దృష్టి సారించి పాఠశాల స్థాయి నుంచి పర్యవేక్షణ చేసి విద్యార్థుల ఆహార అలవాట్లలో మార్పులు తీసుకురావాలని ఆదేశించారు. ప్రతి పాఠశాలలో బడి తోటలు (కిచెన్ గార్డెన్) నిర్వహించి ఆకుకూరలు, క్యారెట్, బీట్ రూట్, చిక్కుడు వంటి పోషకాహారాలను పండించి మధ్యాహ్న భోజన పథకంలో వినియోగించాలని ఆయన చెప్పారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారీలో అప్రమత్తంగా ఉండాలని, తాగు నీరు పట్ల మరింత జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. తాగునీటి ట్యాంక్‌లు ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని అన్నారు. మరుగుదొడ్లు శుభ్రంగా ఉండాలని, రన్నింగ్ వాటర్ ఉండాలని స్పష్టం చేశారు. పాఠశాల పారిశుధ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉండాలని, అవసరమైతే చెత్త బుట్టలు పెట్టాలని సూచించారు. పాఠశాల ఆవరణలో విద్యార్థుల ఆరోగ్యానికి హాని చేసే తినుబండారాలు పట్ల దష్టి పెట్టాలని చెప్పారు. విద్యా బోధన పక్కాగా ఉండాలని, విద్యార్థుల ప్రమాణాలు నిరంతరం పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. విద్యార్థుల పాఠ్యాంశాలు సకాలంలో పూర్తి చేయడమే కాకుండా నోట్ పుస్తకాలు, వర్క్ బుక్ లు ఉపాధ్యాయులు పరిశీలించాలని ఆదేశించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దక్పథం అలవాటు చేయాలని, సైన్స్ ఎగ్జిబిషన్ లు తరచూ నిర్వహించాలని అన్నారు. విద్యతో పాటు క్రీడలను ప్రోత్సహించాలని ఆదేశించారు. మండలాల్లో ఏ క్రీడల్లో ఎక్కువ ఆసక్తి ఉన్నదో గుర్తించి అటువంటి వాటిని ప్రోత్సహించడం వల్ల సహజ నైపుణ్యంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించగలరు ఆయన సూచించారు. సమావేశంలో డిఇఒ జి.పగడాలమ్మ, డిప్యూటీ డిఇఒలు, ఎంఇఒలు, కెజిబివి ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి

ఎస్‌పి ఆకస్మిక సందర్శన

ప్రజాశక్తి - మక్కువ

స్థానిక పోలీసు ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలిం చారు. స్థానిక ఎఎస్ఐ శ్రీనివాసరావుకు పలు సూచనలు చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని పోలీసు సిబ్బందికి సూచించారు .

సాలూరు: రూరల్ సర్కిల్ పరిధిలోని సాలూరు పోలీస్ స్టేషన్‌ను, టౌన్ పోలీస్ స్టేషన్‌ను గురువారం సాయంత్రం ఎస్పీ ఎస్ వి మాధవరెడ్డి పరిశీలించారు. కొద్దిరోజుల క్రితం జిల్లా ఎస్పీ గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన జిల్లాలో గల పోలీసు స్టేషన్ లను పరిశీలిస్తున్నారు. ఆయా స్టేషన్ల పరిధిలో కేసులు, రికార్డు లను ఆయన పరిశీలించారు. రూరల్ సిఐ బాలకృష్ణ, టౌన్ సిఐ వాసు నాయుడు ఆయన వెంట ఉన్నారు.

మహిళలకు రక్షణ కరువు

ప్రజాశక్తి - మక్కువ

రాష్ట్రంలో మహిళలకు కనీసం రక్షణ లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవికుమార్ అన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో, రాష్ట్రంలో దాడులు మరింత ఎక్కువయ్యాయన్నారు. గురువారం స్థానిక జెజె కాలేజీ విద్యార్థులతో కలిసి మానవహారం నిర్వహించారు. ఈ దాడులకు కారణం ప్రధానంగా మహిళలు వేసుకున్న బట్టలని చెప్పిన ఈ సమాజం మరి రామాయణ కాలంలో ఆరు నెలల పసికందు ఏ విధమైన బట్టలు వేసుకుందని, ఏ విధంగా లైంగిక దాడికి ప్రోత్సహించిందని ప్రశ్నించారు. దాడులకు విరివిడిగా లభ్యమవుతున్న గంజాయి, డ్రగ్స్ కారణమని, వాటిని అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు హరికృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయండి

ప్రజాశక్తి - కురుపాం

విద్యాశాఖకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఎపిటిఎఫ్ మన్యం జిల్లా గౌరవ అధ్యక్షులు బంకురు జోగినాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.ఎస్. సుబ్బారావు, పి మోహన్ రావు, డి రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో వారు విలేకర్లతో మాట్లాడుతూ 117 జీవోని రద్దుచేసి స్టేట్ సిలబస్ను తెలుగు భాషలో బోధించడానికి, 2024 డిఎస్సి లేటవుతున్న నేపథ్యంలో తాత్కాలికంగా అకాడమిక్ వాలంటీర్లను నియమించాలని కోరారు. ఈ సమావేశంలో ఎపిటిఎఫ్ నాయకులు జి.వి. శేషగిరి, కొండేటి శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని 33/11కెవి సబ్ స్టేషన్లో పవర్ ట్రాన్స్ఫార్మర్ నిర్వహణ, జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టనున్న నేపథ్యం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్కో ఇఇ గోపాలకృష్ణమూర్తి ఒక ప్రకటన తెలిపారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 3గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించాలని కోరారు.

రాయికురిడి పాఠశాల సందర్శన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని రాయికురిడి జిపిఎస్ పాఠశాలను డిప్యూటీ డిఇఒ పి.నారాయణ సందర్శించారు. విద్యార్థుల హాజరు పరిశీలించారు. విద్యార్థులకు ఆటపాటలతో విద్యను అందించాలన్నారు. అలాగే బంబదుగూడ జిపిఎస్ పాఠశాలను సిఎంఒ చిరంజీవి సందర్శించారు. సిఎం పోషణ మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును సందర్శించారు.

27న ఐటిఐలో మిగులు సీట్లకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి - సాలూరు

ఈనెల 27న స్థానిక ప్రభుత్వ ఐటిఐలో మిగులు సీట్లకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ వి.రవికుమార్ చెప్పారు. ఉదయం 9గంటలకు దరఖాస్తు చేసుకుని వెరిఫికేషన్ పూర్తయిన అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు. ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, డ్రాఫ్ట్ మెన్ సివిల్, కంప్యూటర్ కోర్సులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

పారిశుధ్య పనులు పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పారిశుధ్య పక్షోత్సవాల్లో భాగంగా మండలంలో జరుగుతున్న పారిశుధ్య పనులను గురువారం స్థానిక ఎంపిడిఒ అబ్దుల్ జావెద్ పరిశీలించారు. ఇఒపిఆర్ రమణమూర్తితో కలిసి ఆయన తాళ్లబుడిది, డోకిశీల, గోచెక్క, డికె పట్నం పంచాయతీల్లో జరుగుతున్న డ్రైయిన్ల పూడికతీత, స్ప్రేయింగ్, వ్యర్థాల తరలింపు, కాలువల్లో పూడికతీత కార్యక్రమాలు జరుగుతున్న తీరును గమనించి పలు సూచనలను ఆయా పంచాయతీ కార్యదర్శులకు వివరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

29న చలో కలెక్టరేట్

ప్రజాశక్తి - సీతానగరం

ఈనెల 29న చలో కలెక్టరేట్ నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు తెలిపారు. గురువారం మండలం శివ్వాం దళితుల భూ సమస్యలను పరిష్కరించాలని, అలాగే మండలంలోని భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టే ధర్నాలో పేద లు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



డ్రైవర్లకు సూచనలు చేస్తున్న ఇన్స్పెక్టర్ సత్యనారాయణ

పరిమితికి మించిన ప్రయాణంతో ముప్పు

ప్రజాశక్తి - కురుపాం

పరిమితికి మించిన ప్రయాణం ప్రాణానికి ముప్పని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, ఆర్టిసి సూపరింటెండెంట్ వై.ప్రభాకరరావు అన్నారు. మండలంలోని పి.లేవిడి జంక్షన్ వద్ద వాహనదారులకు, ప్రజలకు సురక్షితమైన ప్రయాణం గుర్చి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటోల్లో, జీపుల్లో, ద్విచక్ర వాహనాల్లో వాటి పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కువ మంది ఎక్కి ప్రయాణించకూడదన్నారు. దీనివల్ల ప్రమాదాల సంభవించి ప్రాణాలు పోగొట్టుకునే దాఖలు ఎన్నో ఉన్నాయని, కావున సురక్షితమైన ప్రయాణమే ప్రజలంతా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సేఫ్టీ డ్రైవింగ్ ఇన్స్పెక్టర్ ఎస్ఎంరావు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ సమస్యపై ఆర్డిఒ సమీక్ష

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగరపంచాయతీలో నెలకొన్న డంపింగ్ యార్డ్ సమస్యపై గురువారం స్థానిక ఆర్డిఒ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. నగరపంచాయితీ కమిషనర్ సర్వేశ్వరరావుతో మాట్లాడి, డంపింగ్ యార్డ్ సమస్య పై వివరాలు తెలుసుకున్నారు. వెంటనే ఈ సమస్య పరిష్కారానికి తన వంతు ప్రయత్నాలు చేస్తానని అన్నారు.

గోముఖి నదిలోకి నీరు విడుదల

ప్రజాశక్తి - మక్కువ

వెంగళరాయసాగర్ ప్రాజెక్టు పరిధిలోని గోముఖి నది రెగ్యులేటర్ నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. గురువారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో 300 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడుతున్నట్లు వారు తెలిపారు. నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నది ఎగువ భాగంలో వర్షాలు కురవడంతో ఐన్ఫ్లో పెరగడం వల్ల నీటిని విడుదల చేయాల్సి వస్తుందని ఇరిగేషన్ అధికారి ప్రశాంత్ తెలిపారు.



ర్యాలీ చేస్తున్న కిశోర బాలికలు, అంగన్వాడీ టీచర్లు

కిశోర బాలికలకు అవగాహన

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం కిశోర బాలికలకు ఐసిడిఎస్ పిఒ బి.సిమ్మలక్ష్మి అవగాహన కల్పించారు. 18ఏళ్లలోపు వివాహం చేసుకోకూడదని, ఆడపిల్లలు చక్కగా చదువుకోవాలని, దేవ వాటిని ప్రోత్సహించాలని, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కెపి నాగమణి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు ఎస్.రాజేశ్వరి, జె.ఉషారాణి, అంగన్వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, పాల్గొన్నారు.

ప్రధాన రహదారులపై గోతులను పూడ్చండి

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్

పట్టణంలో గల రాయగడ రోడ్డు జంక్షన్ కూడలి నుంచి ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న గోతులను పూడ్చేందుకు ఆర్అండ్బి అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని వాహనదారులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఇదే రహదారి గుండా ప్రతినిత్యం ఒడిశా, చత్తీగడ్, ఝార్ఖండ్ రాష్ట్రాల వైపు వందల సంఖ్యలో భారీ వాహనాలు, తిరుగుతుండం వల్ల రహదారికి గోతులు ఏర్పడ్డాయి. చిన్నపాటి గోతులు ఏర్పడినప్పుడు వాటిని కప్పేందుకు ఆర్ అండ్ బి అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో భారీ స్థాయిలో గోతులు ఏర్పడడంతో ఈ రహదారి గుండా ప్రయాణించాలంటే ప్రమాదం ఏ వైపు నుండి వస్తుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్ అండ్ బి అధికారులు ఈ రహదారి గుండా ఏర్పడిన గోతులను కప్పేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



పార్వతీపురం : పట్టణంలో ఇదీ రోడ్డు పరిస్థితి

గుంతలో దిగబడిన భారీ ట్యాంకర్

కొమరాడ: ఆంధ్ర ఒడిస్సా అంతర్రాష్ట్ర రహదారి రోజురోజుకు మరింత అధ్వానంగా మారుతుంది. రోడ్డుపై ఉన్న గోతులు ఇటీవల కురిసన వర్షాలకు మరింత పెద్దవి కావడంతో వాహనాలు గోతుల్లో దిగుబడి పోయి ఇబ్బంది పడుతున్నారు. గురువారం వేకు జామున విశాఖపట్నం నుంచి ఒడిస్సా వైపు వెళు న్న భారీ ట్యాంకర్ గోతిలో దిగుబడిపోవడంతో రెండు పక్కల వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో భారీగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. వాహనదారులు, ప్రజలు ట్రాఫిక్లో చిక్కుకొని తీవ్ర అవస్థలు పడ్డారు. అనంతరం లారీ డ్రైవర్లు స్థానికుల సహాయంతో లారీని బయటకు తీసి ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఆర్అండ్బి అధికారులు స్పందించి తాత్కాలికంగా గోతులు కప్పే విధంగా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

రోడ్లు బురదమయం

సీతానగరం : మండలంలోని గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పలు రోడ్లు బురదమయంగా తయారవ్వడంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే కొత్తవలస వెళ్లే రహదారి పూర్తిగా బురదమయమైంది. అలాగే సీతానగరం నుంచి వచ్చాడ వెళ్లే బిటి రోడ్డు బురదమయమైంది. అలాగే లింక్ రోడ్లు కూడా బురదమయంతో బతుకులతో తయారయ్యాయి. దీంతో ఆయా గ్రామస్తులు నరకయాతన పడుతున్నారు. దీనిపై ఆర్ అండ్ బి అధికారులు స్పందించి వాటికి ప్రత్యామ్నాయ పనులు చేపట్టాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.



భామిని : గోతిలో ఇరుక్కున్న లారీని బయలకు లాగుతున్న జెసిబి

జెసిబితో గోతిలో ఇరుక్కున్న లారీ తొలిగింపు

భామిని: మండలంలోని బిల్లుమడ సమీపంలో ఒరిస్సా నుంచి వస్తున్న ఇసుక లారీ ప్రధాన రహదారి గోతిలో గురువారం సాయంత్రం ఇరుక్కుంది. దీంతో భారీ వాహనాలు రాక పోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. జెసిబితో లారీని బయటికి లాగి గుంతలను కప్పారు. గోతిని కప్పటానికి అవసరమైన మెటల్, కంకరను స్థానిక టిడిపి నాయకుడు బాధపు సుధ ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ఎఎస్ఐ కాంతారావు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాంబాబు, విఆర్ఒ గెల్లంకి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బకాయి జీతాలు చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పార్వతీపురం మన్యం జిల్లాలో ఉన్న ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి గత 18 నెలలుగా బకాయి వేతనాలు చెల్లించి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం సిఐటియు ఆధ్వర్యంలో పార్వతీపురం ఆర్టిసి కాంప్లెక్స్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ, అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. తక్షణమే ప్రభుత్వం కల్పించుకొని బకాయి పడ్డ గౌరవ వేతనాలను చెల్లించాలి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ కార్మికులు ప్రకృతి వ్యవసాయం కోసం రైతులను చైతన్య పరుస్తూ అవగాహన కల్పిస్తూ రైతులను చైతన్య పరుస్తూ నిరంతరం పనిచేస్తున్నారని గుర్తు చేశారు. వర్షాకాలంలో గట్టులపైన పొలాల్లో పాములు ఇతర విశ్వసర్పాలు మధ్య పని చేస్తున్న వీళ్ళకి ఎటువంటి భరోసా లేకపోవడం చాలా అన్యాయమన్నారు. పైగా 18 నెలలుగా గౌరవ వేతనాలు చెల్లించకపోవడం వల్ల కుటుంబాలతో చాలా ఆర్థిక ఇబ్బందులు పడుతూ విద్య వైద్యానికి కూడా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీరికి ప్రమాద బీమా చేయాలని, టిఎడిఎలు, హెచ్ఆర్ఎ, పిఎఫ్ వంటి సౌకర్యాలు కల్పిస్తూ తక్షణమే ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు ఈ సమస్యలను పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. అనంతరం కార్యాలయంలో డిఆర్ఒ జి.కేశవనాయుడుకు, డిపిఎంయుకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఉపాధ్యక్షులు వి.ఇందిర, కోశాధికారి జి.వెంకటరమణ, బంకురు సూరిబాబు, జిల్లా కమిటీ ప్రతినిధులు ప్రసాదు, సురేష్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు, సిబ్బంది

మంత్రి పై విమర్శలు తగవు

ప్రజాశక్తి- సాలూరు

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణిపై గిరిజన సంఘాల నాయకులు విమర్శలు చేయడం తగదని టిడిపి ఎస్టి సెల్ నియోజకవర్గ నాయకులు కె.లక్ష్మణరావు అన్నారు.గురువారం ఆయన మంత్రి సంధ్యారాణి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం హయాంలోనే ఏకలవ్య పాఠశాలల్లో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో బోధనేతర సిబ్బంది నియామకం జరిగిందని చెప్పారు. అప్పుడు నోరు మెదపని గిరిజన సంఘాల నాయకులు ఇప్పుడు ఎందుకు మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. ఒకరో, ఇద్దరో గిరిజనేతరుల నియామకం రిజర్వేషన్ ప్రాతిపదికన జరిగి వుండవచ్చునని చెప్పారు. 2014 నుంచి 2019 మధ్య కాలంలో రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వమే ఏకలవ్య గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా సంధ్యారాణి బాధ్యతలు చేపట్టిన తర్వాత ఏకలవ్య గురుకుల, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో సమస్యలు గుర్తించి పరిష్కారానికి కృషి చేస్తున్నారని చెప్పారు. ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంల నియామకం, విద్యార్థులకు కంచాలు, దుప్పట్లు, పెట్టెలు పంపిణీకి చర్యలు తీసుకున్నారని చెప్పారు. గిరిజనేతరుడైన పాలక రంజిత్ కుమార్ మంత్రి సంధ్యారాణిపై విమర్శలు చేయడం తగదని కె.లక్ష్మణరావు హెచ్చరించారు. ఈ సమావేశంలో టిడిపి గిరిజన నాయకులు దొర లక్ష్మణ పాల్గొన్నారు.

వెంటాడుతున్న సిబ్బంది కొరత

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి రెసిడెన్షియల్ పారిశ్రామిక శిక్షణ కేంద్రం (ఐటిఐ)లో సిబ్బంది కొరత వెంటాడుతుంది. దీంతో విద్యార్థులకు పూర్తిసాయిలో చదువు అందడం లేదు. 10 మంది సిబ్బంది విధులు నిర్వహించాల్సి ఉండగా ప్రిన్సిపల్ ఒక్కరే ఉన్నారు. ట్రైనింగ్ ఆఫీసర్ ఒకరు, డిప్యూటీ ట్రైనింగ్ ఆఫీసర్ ఐదు, అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్ 1, డ్రెస్ మేకింగ్ 1, వెల్డర్ 1 పోస్టులు కొన్ని నెలలుగా ఖాళీగా ఉన్నాయి. మరోవైపు సీనియర్ అసిస్టెంట్ 3, టైపిస్ట్ 1, ఒఎస్ 3, వాచ్ మెన్1, స్వీపర్ 1 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అధ్యాపకులు లేకపోవడంతో బోధన సక్రమంగా జరగడంలేదని ప్రభుత్వం స్పందించి పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

2న మండల సమావేశం

గుమ్మలక్ష్మీపురం : ఆగస్టు 2న మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ గొర్జి రమేష్బాబు తెలిపారు. ఎంపిపి కె.దీనమయ్య అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని 27 పంచాయతీల్లో ఉన్న సర్పంచులు, ఎంపిటిసిలు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

నాండ్రగండలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని జి.శివడ పంచాయతీ నాండ్రగండ గిరిజన గ్రామంలో మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.ప్రజ్ఞ గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం వర్షాకాలం నేపథ్యంలో వ్యాధుల బారిన పడకుండా ముందస్తు తీసుకోవలసిన జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, హెల్త్ సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ బి. ప్రజ్ఞ

విక్రంపురంలో ఫ్యామిలీ డాక్టర్

వీరఘట్టం : మండలంలోని విక్రంపురంలో గురువారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి జ్వర పీడితులతో పాటు వివిధ రకాలైన రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించండి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పార్వతీపురంలోని చెరువుల్లో ఆక్రమణలు తొలగించాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు గొర్లి వెంకట రమణారావు, జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక తహశీల్దార్ కె.ఆనంద్రావును కలిసి పార్వతీపురంలో కబ్జాకు గురైన చెరువుల విషయమై చర్చించారు. పార్వతీపురంలోని నెల్లిచెరువు, లంకెల చెరువు, లక్ష్మీ నాయుడు చెరువు, దేవుడి బంద, బిళ్లబంద, కొత్తచెరువు, కోదువానిబంధ, సంఘం నాయుడు చెరువు, కామయ్య బంధ, వరహాలు గెడ్డ తదితరవి ఆక్రమణలకు గురయ్యాయన్నారు. తక్షణమే వాటిలో ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. దీనికి తహశీల్దార్ స్పందిస్తూ నాయుడు చెరువులో 54, లంకెల చెరువులో 16 ఆక్రమణలను గుర్తించామన్నారు. నెల్లి చెరువులో ముగ్గురిపై కేసులు నమోదు చేశామన్నారు. చెరువుల్లో ఆక్రమణలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పార్లమెంటు నియోజకవర్గం అధ్యక్షులు సిగడాం భాస్కరరావు, జిల్లా అధికార ప్రతినిధి రేజేటి దయామణి , లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార నైపుణ్యాలు పెంచుకుని

ఉపాధి అవకాశాలు మెరుగు పరుచుకోవాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

వ్యాపార నైపుణ్యాలు పెంచుకోవాలని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ కోరారు. నైపుణ్యాలతో అద్భుతమైన అవకాశాలు వస్తాయని, పలువురికి ఉపాధి కల్పించడం ద్వారా వారి కుటుంబాలకు ఆశా దీపాలుగా నిలవగలరని అన్నారు. గురువారం స్థానిక ఐటిడిఎ గిరిమిత్ర సమావేశ మందిరంలో డిఆర్డిఎ, నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా పరిశ్రమల సంస్థ, నాబార్డు తదితర సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు, ఇతర రంగాలను విభజించి వాటి వివరాలు క్షుణ్ణంగా పరిశీలించనున్నట్లు తెలిపారు. అర్హత, వనరులున్న అభ్యర్థులకు రుణాల మంజూరులో సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ తమ సొంత కాళ్ల మీద నిలబడాలనేది లక్ష్యమన్నారు. అవసరమైన శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా ఎదిగితే పలువురికి ఉపాధి అవకాశాలు వస్తాయని అన్నారు. ఔత్సాహికుల నుంచి ప్రతి నెలా దరఖాస్తులు స్వీకరిస్తామని, వ్యాపార నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు. కోటి రూపాయలు వరకు రుణాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. అనంతరం పలువురు ఔత్సాహికులు మాట్లాడారు. కార్యక్రమంలో డిఆర్డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ వై.సత్యంనాయుడు, జిల్లా పరిశ్రమల అధికారి ఎం.వి.కరుణాకర్, జిల్లా నైపుణ్య అభివద్ధి అధికారి యు.సాయి కుమార్, నాబార్డు జిల్లా అభివద్ధి మేనేజర్ దినేష్ కుమార్ రెడ్డి, ఎస్బిఐ రీజనల్ మేనేజర్ బిబి సాహు, ఖాదీ పరిశ్రమల బోర్డు అభివృద్ధి అధికారి రవికుమార్ , ఔత్సాహికులు పాల్గొన్నారు.

ఢిల్లీలో ధర్నా విజయవంతం : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

టిడిపి ప్రభుత్వం 45రోజుల అరాచక పాలనకు నిరసనగా ఢిల్లీలో వైసిపి చేపట్టిన ధర్నా విజయవంతమైందని మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర అన్నారు. గురువారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన నెలన్నర రోజుల్లో రాష్ట్రం లో టిడిపి ప్రభుత్వం చేసిన దౌర్జన్యాలు, విధ్వంసాలు, హత్యాకాండపై ప్రదర్శించిన వీడియో, ఫొటో లు యావద్దేశం చూసిందని చెప్పారు. ధర్నాకి మద్దతు తెలియజేయడానికి వచ్చిన అనేక రాజకీయ పార్టీల నాయకులు టిడిపి దమనకాండను చూసి నివ్వెరపోయారని చెప్పారు. జాతీయ మీడియా ప్రతినిధులు కూడా ఆశ్చర్యానికి గురయ్యారని చెప్పారు. ఇప్పటికైనా టిడిపి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించాలని కోరారు.

అధికారమదంతో బిజెపి నేత వ్యాఖ్యలు

రాష్ట్ర అసెంబ్లీలో బిజెపి శాసనసభా పక్ష నేత విష్ణు కుమార్ రాజు వైసిపి నుద్దేశించి ప్రజలపై చేసిన వ్యాఖ్యలు అధికారమదంతో చేసినట్లుగా ఉన్నాయని రాజన్నదొర అభిప్రాయం వ్యక్తం చేశారు. అన్నం తినేవారెవరూ వైసిపికి 40శాతం ఓట్లు వేయరని విష్ణు కుమార్రాజు వ్యాఖ్యానించడంపై ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో, కేంద్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చి రెండు నెలలు కాకముందే కూటమి పార్టీ నాయకులకు అహంకారం నెత్తికెక్కినట్లు వుందన్నారు. ఇలాంటి నేతలకు ప్రజలే తగిన సమయంలో బుద్ధి చెపుతారని రాజన్నదొర చెప్పారు.

అంతర్ పంటలతో అధిక లాభాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

అంతర్ పంటలతో అధిక లాభాలు పొందవచ్చునని నార్త్ కోస్ట్ రీజినల్ అధికారి ఎన్ హేమలత అన్నారు. మండలంలోని చింతలపాడులో పత్తిక జూలుమమ్మ మూడెకరాల జీడి తోటలో వేసిన వేరుశనగ, కంది, చిక్కుడు, కర్రపెండలము, బెండ, బీర, జొన్న తదితర సుమారు 10 రకాల అంతర్ పంటల సాగును ఆమె పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ అంతర్పంట రైతుకు అదనపు ఆదాయంగా లభిస్తుందన్నారు. అన్ని రకాల పంటలు వేసుకోవడం వల్ల జీడి పంటకు ఎటువంటి తెగుళ్ల రాకుండా, పంటల్లో జీవ వైవిధ్యం పెంపొందిస్తామని, రీజనల్ పరిధిలోని అన్ని గ్రామాల్లోని జీడి వేసిన రైతులు అంతర్ పంటలు వేసుకునేలా రైతులు అందుబాటులో వుండాలని అన్నారు. సకాలంలో తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని సూచించారు. మూడేళ్ల నుంచి అంతర్ పంటలు వేసుకుంటున్నామని, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఇంటికి ఉపయోగించుకుని మిగిలినవి అమ్ముకుంటున్నామని రైతులు తెలిపారు. తమను చూసి మిగతా రైతులు ఈ విధంగా జీడిలో అంతర్ పంటలు వేసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఎ అన్నపూర్ణ, దేవీప్రసాద్, రైతులు కోలక సుమన్, పత్తిక భాస్కరరావు ఉన్నారు.

దళితుల రిలే దీక్షలకు ఎస్ఎఫ్ఐ మద్దతు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక కలెక్టరేట్ ఎదుట గత పది రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న శివ్వాం దళితులకు గురువారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.పండు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టును తప్పుదోవ పట్టించి స్టే ఆర్డర్ తెచ్చిన దళితులు సాగు చేస్తున్న భూమిపైకి వెళ్లనీయకుండా పెత్తందారులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే రెవెన్యూ అధికారులు శివ్వాం దళితుల భూమి దళితులకు అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే శివ్వాం దళితులపై దాడి చేసి తిట్టి కొట్టిన పెత్తందారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు జిల్లాలో పేదలు సాగు చేస్తున్న భూములకు డిపట్టాలు ఇవ్వాలని, పట్టాలిచ్చి భూములు అప్పజెప్పాలని, అన్యాక్రాంతమై పెత్తందార్ల చేతుల్లో ఉన్న భూములు వెంటనే తిరిగి పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కొల్లిగంగునాయుడు, రెడ్డి శ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

పలు గ్రామాల్లో మలాథియన్ స్ప్రేయింగ్

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని కోట సీతారాంపురం, సూరంపేటలో మలాథియన్ స్ప్రేయింగ్ చేపట్టినట్లు ఇఒపిఆర్డి కెకె కుమార్ వర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో దోమల నియంత్రణకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అన్ని పంచాయతీల్లోనూ ఈ కార్యక్రమం చేయాలన్నారు. దీనివల్ల సీజనల్ వ్యాధులను నియంత్రించ వచ్చునని చెప్పారు. కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచులు కుడుమల కృష్ణమూర్తి, ఎం.వసుంధర, పంచాయతీ కార్యదర్శులు కామేశ్వరి, కామేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పరీక్షలకు సిద్ధం కావాలి

సీతంపేట: ఆగస్టు 1 నుంచి జరగనున్న ఎఫ్ఎ-1 పరీక్షలకు విద్యార్థులందరూ సిద్ధం కావాలని ప్రత్యేకాధికారి పి.కోటిబాబు అన్నారు. మండలంలో సామరెల్లి బాలికల ఆశ్రమం ఉన్నత పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సిలబస్ పూర్తయిందా లేదా? అని అడిగి తెలుసుకున్నారు. జాతీయ నూతన విద్యా విధానం గురించి, శిక్షా సప్తాహ్ కార్యక్రమం గురించి వివరించారు. ఇప్పటి నుండే 10వ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయనతో పాటు ప్రధానోపాధ్యాయులు ఆరిక భాస్కరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సామగ్రి వితరణ

కురుపాం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మహాత్మా గాంధీ కేన్సర్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ వి.మురళి లక్ష రూపాయల విలువైన కంప్యూటర్, ప్రింటర్, ల్యాప్టాప్, ఇన్వర్టర్ను ప్రధానోపాధ్యాయులు టి.శంకరరావుకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుపాం గ్రామాన్ని దత్తత తీసుకున్నామని మహాత్మా గాంధీ కేన్సర్ ఆసుపత్రి గతంలో మెడికల్ కాంపులు నిర్వహించామని, ఇప్పుడు పాఠశాలకు ఉపయోగపడే వస్తువులు వితరణగా అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో విశాఖ ఈస్ట్ క్రైమ్ సిఐ సొండి ఆదాం, కురుపాం పాఠశాల దాతల కమిటీ అధ్యక్షులు బెహరా దివాకర్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు పల్ల సింహాచలం నాయుడు పాల్గొన్నారు.

మూలిగూడ జంక్షన్ వద్ద తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రానికి సమీపాన గల మూలిగూడ జంక్షన్ వద్ద 11 కెవి విద్యుత్ వైర్లకు భారీ కంటైనర్ లారీ తగిలి పెనుప్రమాదం తప్పిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం గుమ్మలక్ష్మీపురం నుంచి తుని జీడీ పిక్కలు తీసుకుని వెళ్తున్న భారీ కంటైనర్ లారీ మూలిగూడ జంక్షన్ వద్ద 11 కెవి విద్యుత్ వైర్లు తగిలింది. లారీ టైర్ పాక్షికంగా కాలుతున్న సమయంలో స్థానికులు స్పందించి వెంటనే విద్యుత్ శాఖ అధికారులు ఫోన్ ద్వారా సమాచారం అందడంతో వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో లారీలో గల డ్రైవర్, క్లీనర్కు ప్రాణాపాయం తప్పి గాయాల పాలయ్యారు. వీరిని 108 వాహనంలో స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా వైద్య సిబ్బంది చికిత్స అందిస్తున్నారు. సకాలంలో విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ ఆపకపోతే వారి ప్రాణాలు పోయి ఉండేవని విద్యుత్ శాఖ అధికారులను స్థానికులు అభినందించారు.

మళ్లీ మొదలైన కుక్కల దాడి

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని వెంకటరాజపురం గ్రామంలో మళ్లీ వేట కుక్కల దాడులు మొదలయ్యాయి. గురువారం గ్రామానికి చెందిన కర్రి పోలమ్మ అనే మహిళపై దాడిచేశాయి. ఉదయం 9 గంటల సమయంలో తమ పొలంలో ఉడుపు జరుగుతుండగా చూసేందుకు వెళ్లిన ఆమెపై అదే సమయంలో వేట కుక్కలు ఒక్కసారిగా దాడి చేసి ఆమె ఎడమ కాలు, గొంతు, చెవి చీల్చి తీవ్రమైన గాయాలు చేశాయి. దీంతో ఆమె గట్టిగా కేకలు వేయగా స్థానిక రైతులు అక్కడకు చేరుకుని కుక్కలను చెదరగొట్టారు. వెంటనే స్థానికులు పోలమ్మను చినమేరంగి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లగా వైద్యాధికారి ఆర్ఆర్కె చైతన్య చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇప్పటికే ఈ కుక్కల దాడులో అనేక మంది గాయపడగా మరికొందరు ప్రాణాలు కోల్పోయారు. ఇంత జరిగినా అధికారు మాత్రం పట్టించుకునే పరిస్థితి లేదని మండలం ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

3.5 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి- పాచిపెంట

అక్రమంగా తరలిస్తున్న మూడున్నర కేజీలు గంజాయిని నలుగురు వ్యక్తులు నుండి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పి.నారాయణరావు తెలిపారు. ఆయన అందించిన వివరాలు ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రం నుండి పలు రాష్ట్రాలకు చెందిన నలుగురు వ్యక్తులు పి.కోనవలస మీదుగా మూడున్నర కేజీలు గంజాయిని తరలిస్తుండగా గురువారం సాయంత్రం వాహనాల తనిఖీలు భాగంగా పట్టుకున్నామన్నారు. వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

అక్రమ మద్యం, నాటుసారా ధ్వంసం

ప్రజాశక్తి-పాలకొండ

వివిధ కేసుల్లో పట్టుబడిన 458 మద్యం బాటిళ్లను, 436 లీటర్ల నాటుసారాను గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ధ్వంసం చేశారు. అదే విధంగా వివిధ కేసుల్లో సీజ్ చేసిన 8 ద్విచక్ర వాహనాలతో పాటు, ఒక కారును వేలం వేయగా, రూ.96,052కు వేలం పాట ఖరారైంది. కార్యక్రమంలో డీఎస్పీ జివి కృష్ణారావు, సిఐ చంద్రమౌళి, ఎస్ఐ ప్రశాంత్ కుమార్ ఇతర సిబ్బంది ఉన్నారు.